సాక్షి నిర్మల్

మంగళవారం । 9 । ఏప్రిల్ । 2024



పోలీసుల కవాతు

దిలావర్‌పూర్: మండల కేంద్రంలో కేంద్ర బలగాలు.. స్థానిక పోలీసులతో కలిసి సోమవారం కవాతు నిర్వహించాయి. నిర్మల్ సీఐ శ్రీనివాస్, దిలావర్‌పూర్ ఎస్సై సుమాంజలి, పోలీసులు పాల్గొన్నారు.

రంజాన్ వేళలు

మంగళ
ఇఫ్తార్
6:33

బుధ
సహర్
4:40

వాతావరణం

గరిష్టం/కనిష్టం
38.4 /26.3

ఆకాశం కొంతమేర మేఘావృతమవుతుంది. ఉష్ణోగ్రతలు రెండు డిగ్రీలు తగ్గుతాయి. వేడి, ఉక్కపోత కాస్త తగ్గుతుంది. చినుకులు పడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

నేటి నుంచి మధ్యాహ్న భోజనం బంద్



కలెక్టరేట్ ఎదుట మధ్యాహ్న భోజన కార్మికులు

నిర్మల్‌చైన్‌గేట్: పాఠశాలలో పనిచేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులకు బిల్లులు రాకపోవడంతో మంగళవారం నుంచి జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాల్లో మధ్యాహ్న భోజనం బంద్ చేయాలని నిర్ణయించినట్లు ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు బూక్య రమేశ్ తెలిపారు. మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కలెక్టరేట్ ఎదుట సోమవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రమేశ్ మాట్లాడుతూ ఒకటో తరగతి నుంచి 8వ తరగతి వరకు కోడిగుడ్ల బిల్లులు, 9, 10 తరగతికి సంబంధించి కోడిగుడ్ల బిల్లులతోపాటు రూ.2 వేల జీతం బిల్లు రావాలన్నారు. మధ్యాహ్న భోజన కార్మికులకు జీతం లేకపోవడంతో సరుకులు తీసుకురాలేక కిరాణ కొట్టులో ఉద్దెర ఇవ్వడం లేదన్నారు. వెంటనే పెండింగ్ బిల్లులు, జీతాలు చెల్లించాలని కోరారు. నిరసనలో రాష్ట్ర నాయకులు లక్ష్మి, మొనవ్వ, సాయవ్వ, జిల్లా నాయకులు మమత, మనీషా, పావని, భాగ్య, లలిత, రజిత, విమల, హంస, లక్ష్మి, రూప, సావిత్రి, మండల నాయకులు లక్ష్మి, రాధ, లలిత, జుబేదా పర్వీన హసీనా తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు సౌకర్యాలు కల్పించాలి

- డీఆర్డీవో, విజయలక్ష్మి



కూలీలతో కలిసి పనిచేస్తున్న డీఆర్డీవో

కడెం: ఉపాధి కూలీలకు పని ప్రదేశంలో టెంట్, తాగునీటి సౌకర్యం కల్పించాలని డీఆర్డీవో విజయలక్ష్మి సూచించారు. మండల కేంద్రంలోని ఫిష్‌పాండ్స్, కన్నాపూర్, బెల్లాల్ గ్రామల్లో జరుగుతున్న ఉపాధి పనులను సోమవారం పరిశీలించారు. కాలువ పూడికతీత పనుల్లో పాల్గొని కూలీలతో కలిసి తట్ట మోశారు. ఎండలు ఎక్కువగా ఉన్నందున ఉదయం 7 గంటలకే పనులకు వెళ్లాలని సూచించారు. ఇందులో ఏపీవో జయదేవ్, టీఏ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ నిర్వాకంతోనే నీటి ఎద్దడి

- బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి
- ఎస్సారెస్పీ ఆయకట్టుకు నేటి నుంచి సాగునీటి విడుదల

నిర్మల్‌చైన్‌గేట్: ప్రభుత్వ నిర్వాకంతోనే జిల్లాలో నీటిఎద్దడి ఏర్పడిందని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ఆరోపించారు. తన క్యాంపు కార్యాలయంలో సోమవారం మాట్లాడారు. ఇరిగేషన్ శాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జతో మాట్లాడి ఎస్సారెస్పీ ఆయకట్టుకు మంగళవారం నుంచి సాగునీరు విడుదల చేసేలా చర్యలు తీసుకున్నామన్నారు. ఎస్సారెస్పీ నుంచి నీటిని డిఫాక్టో సీఎం దోచుకెళ్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 8 టీఎంసీల నీటిని తరలించుకుపోయినా కాంగ్రెస్ నాయకులు ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. అన్నదాతల దుస్థితికి ప్రభుత్వ నిర్లక్ష్యం, అధికారుల అలసత్వమే కారణమన్నారు. సమావేశంలో సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు, ముధోల్ ఎమ్మెల్యే రామారావుపటేల్, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు మస్కాపూర్ పాఠశాల ఎంపిక



డ్యూయల్ బెంచీలతో ఉపాధ్యాయులు

ఖానాపూర్: కేంద్ర ప్రభుత్వం ఈ గవర్నెన్స్ ఆధ్వర్యంలో సీఎస్ఆర్, హెచ్‌డీఎఫ్‌సీ సంయుక్తంగా అమలు చేస్తున్న యువ పరివర్తన్ పథకంలో మౌలిక వసతుల కల్పనకు మండలంలోని మస్కాపూర్ ఉన్నత పాఠశాల ఎంపికైంది. ఈమేరకు పాఠశాలకు సోమవారం 10 డ్యూయల్ బెంచీలు వచ్చాయని హెచ్‌ఎం నరేందర్ రెడ్డి తెలిపారు. ఇందు కోసం ప్రత్యేకంగా పాఠశాలలో ఒక గదిని కేటాయించగా వారి వెంట వచ్చిన సిబ్బంది వాటికి కలర్ వేసి, కింద మ్యాట్ పరిచి వాటిని సిద్ధం చేశారు. పలు కంపెనీలు ఏకతాటిపైకి వచ్చి కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబులిటీగా ఏర్పడగా వీరికి హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ తోడై పరివర్తన్ పేరుతో వసతులు కల్పిస్తున్నట్లు వివరించారు. కేంద్ర ప్రభుత్వ ఏఐ సాంకేతిక విభాగం యువ పథకం కింద విద్యార్థుల కోసం కంప్యూటర్లను సైతం సమకూర్చనున్నట్లు హెచ్‌ఎం పేర్కొన్నారు.

క్రోధి.. ఆశలు



తెలుగు నూతన సంవత్సరాది.. ఉగాది. షడ్రుచుల పండుగ. ఈ రోజున ఏదైనా శుభకార్యాలు ప్రారంభిస్తే ఏడాదంతా శుభాల ఉషస్సులు వెల్లివిరిస్తాయని ప్రజల నమ్మకం. నేడు క్రోధి నామ సంవత్సరానికి ఘన స్వాగతం పలికేందుకు జిల్లావాసులు సిద్ధమయ్యారు. ఆలయాల్లో ఉదయం పూజలు, సాయంత్రం పంచాంగ శ్రవణ కార్యక్రమాల కోసం ఏర్పాట్లు పూర్తయ్యాయి. క్రోధి.. కోపాన్ని, ద్వేషాన్ని జయించి, ఉప్పొంగే ఉత్సాహాలు, సంతోషాలను అందించాలని.. విజయాలను విరబూయించాలని ఆశిద్దాం.



విద్య.. వైద్యం.. లోపభూయిష్టం!

నిర్మల్: జిల్లాలో ప్రధానమైన విద్య, వైద్య వ్యవస్థల్లోనే లోపాలు ఉన్నాయి. ఇటీవల చోటుచేసుకున్న ఒక్క ఘటన వీటిని ఎత్తిచూపింది. నర్సాపూర్(జి) కేజీబీవీలో మంగళవారం నుంచి కొనసాగిన ఫుడ్‌పాయిజన్ ఘటనలో దాదాపు 63 మంది వరకు విద్యార్థినులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. నిర్మల్ ఆస్పత్రిలో 39, నర్సాపూర్‌లో 23 మంది, పరిస్థితి సీరియస్‌గా ఉండటంతో ఒకరిని నిజామాబాద్ తరలించారు. ఇప్పటికీ ఇంకా కొంతమంది పూర్తిగా కోలుకోలేదు. ఈ ఘటనలో ముగ్గురిని బాధ్యులను చేసి తీసేసి, సంబంధిత అధికారికి నోటీసులిచ్చి చేతులు దులుపుకున్నారు. ఈ ఒక్క ఘటన జిల్లాలో రెండు ప్రధానమైన శాఖల్లో నిర్లక్ష్యం, పట్టింపులేనితనం, సరిపడా సౌకర్యాలు, వైద్యులు లేకపోవడం వంటి సమస్యలను ఎత్తిచూపింది. ఏదైనా ఘటన జరిగినప్పుడు జిల్లా విద్యాశాఖ అధికారులు వ్యవహరించే తీరునూ చూపించింది. జిల్లాలో అనుకోని పెద్దఘటన/ప్రమాదం జరిగినప్పుడు వైద్య సేవల పరిస్థితి ఎలా ఉంటుందో కళ్లకు కట్టించింది.

- ఎత్తిచూపిన 'ఫుడ్‌పాయిజన్' ఘటన
- విద్యాశాఖలో పర్యవేక్షణ కరువు
- కప్పిపుచ్చుకునే ధోరణిలో జిల్లా అధికారి
- ఆస్పత్రుల్లో సరిపోని మంచాలు



నిర్మల్ ఆస్పత్రిలో ఒకే బెడ్‌పై ఇద్దరు విద్యార్థినులకు చికిత్స

పూర్తి వైద్యం.. ఇంకెప్పుడు..

ఒకేసారి ఓ 20 మంది బాధిత విద్యార్థినులు వస్తేనే రెండు ఆస్పత్రుల్లో ఇబ్బందులు ఎదురయ్యాయి. ఒకవేళ ఇంతకు మించి ఏదైనా పెద్ద ఘటన జరిగినప్పుడు వైద్యసేవల పరిస్థితి ఏంటి..? అన్న ప్రశ్న జిల్లావాసులు వేస్తున్నారు. యాక్సిడెంట్లు, ఇతర ఘటనలు జరిగినప్పుడు సర్కారు దవాఖానాల్లో సకాలంలో వైద్యం అందుతుందా.. నమ్ముకుని వచ్చిన వారి ప్రాణాలు నిలుస్తాయా..? అన్న సందేహాలూ వ్యక్తం చేస్తున్నారు. వైద్యసేవలన్నీ అందిస్తున్నాం.. సరిపడా వైద్యులూ ఉన్నారని చెప్పే జిల్లా వైద్యాధికారులు ఘటన జరిగినప్పుడు వెనువెంటనే సదరు వైద్యులను ఎందుకు రప్పించలేకపోయారన్న



నర్సాపూర్(జి) ఆస్పత్రిలో విద్యార్థినులకు చికిత్స..

ప్రశ్నలనూ బాధిత తల్లిదండ్రులు వేయడం కనిపించింది. ఏదిఏమైనా.. ఈ ఒక్క ఫుడ్‌పాయిజన్ ఘటన జిల్లాకు ఆయువుపట్టులాంటి విద్య, వైద్యశాఖల్లోని లోపాలను ఎత్తిచూపింది. ఈనేపథ్యంలో ఇప్పటికైనా సంబంధిత అధికారులు తగు చర్యలు తీసుకోవాలని జిల్లావాసులు కోరుతున్నారు.

మంచాలు లేకపోతే ఎలా..



అధికారుల తీరుపై తల్లిదండ్రులు ఆగ్రహం..

జిల్లాగా ఏర్పడినా.. మెడికల్ కాలేజీ వచ్చినా.. ఇప్పటికీ నిర్మల్‌లో పూర్తిస్థాయి వైద్యసేవలు అనుమానమే అన్నట్లుగా ఉన్నాయి. నర్సాపూర్(జి) ఫుడ్‌పాయిజన్ ఘటనతో మరోసారి జిల్లాలో సర్కారు వైద్యంలో లోపాలు బయటపడ్డాయి. తీవ్ర అస్వస్థతకు గురైన విద్యార్థినులను నర్సాపూర్(జి) 30 పడకల, నిర్మల్ జనరల్ ఆస్పత్రులకు తరలిస్తే కనీసం సరిపడా మంచాలూ లేవు. ఒక్కో బెడ్‌పై ఇద్దరు విద్యార్థులను పడుకోబెట్టాల్సి వచ్చింది. ఓ దిక్కు పదుల సంఖ్యలో విద్యార్థినులు వాంతులు, విరేచనాలు, తీవ్రమైన జ్వరంతో సీరియస్‌గా మారుతుంటే.. ఒకరిద్దరు వైద్యులు, అరకొర సిబ్బంది తండ్లాడటం కనిపించింది. ఇలాంటి ఘటనలప్పుడూ జిల్లా వైద్యాధికారులు తక్షణమే స్పందించి సరైన ఏర్పాట్లు చేయకపోతే.. ఇంకెప్పుడు స్పందిస్తారన్న ప్రశ్నలను విద్యార్థినులు తల్లిదండ్రులు వేశారు.

విద్యాశాఖ.. పర్యవేక్షణ లోపం

'మిమ్మల్ని నమ్మి, మా పిల్లల్ని పంపిస్తే.. ఇలా చేస్తారా..? కనీసం వారు ఎలా ఉంటున్నారు..? వారికి ఏం తిండి పెడుతున్నారు..? అని కూడా చూడరా..' అని ఫుడ్‌పాయిజన్ బాధిత విద్యార్థుల తల్లిదండ్రులు ప్రశ్నించారు. 'ఈ ఎండాకాలంలో మన ఇంట్లో పొద్దున వండుకున్న భోజనం సాయంత్రానికే తినం.. అలాంటిది ఒకరోజు ముందురాత్రి వండిన దాన్ని ఎలా పెడుతున్నారు. చెడిపోయిన పప్పులు, కుళ్లిపోయిన కూరలను పిల్లలకు పెడుతుంటే కనీసం పరిశీలించకుండా ఏంచేస్తున్నారు..' అని వారంతా అడుగుతుంటే విద్యాశాఖ అధికారుల వద్ద నుంచి సమాధానాలు రాలేదు. వంటమనుషులు, వడ్డించేవాళ్లపైనే విద్యార్థుల పర్యవేక్షణ వదిలేస్తున్న తీరుపై వారు మండిపడ్డారు.

నిర్లక్ష్య ధోరణి..

జిల్లా ఏర్పడినప్పటి నుంచి విద్యాశాఖలో నిర్లక్ష్య ధోరణి అలాగే కొనసాగుతోంది. గత విద్యాశాఖ అధికారి తీరుపై విమర్శలు వెల్లువెత్తడంతో ఆదిలాబాద్-నిర్మల్ డీఈవోలను అటూఇటు మార్చారు. కొంతకాలం వరకు బాగానే ఉన్నా.. మళ్లీ పాతకథే మొదలైంది. పైకి అంతా బాగానే ఉన్నట్లు కనిపిస్తున్న విద్యాశాఖలో అడుగడుగునా లోపాలు, అవినీతి, నిర్లక్ష్యధోరణి ఉన్నట్లు చాలామంది ప్రభుత్వ ఉపాధ్యాయులే బహిరంగంగా చెబుతున్నారు. కస్తూరిబాగాంధీ బాలికా విద్యాలయాల పర్యవేక్షణలోనూ నిర్లక్ష్య ధోరణి ఫుడ్‌పాయిజన్ ఘటనతో బయటపడింది. అంతపెద్ద ఘటన జరిగి, పదుల సంఖ్యలో విద్యార్థినులు విలవిలలాడుతుంటే.. జిల్లా విద్యాశాఖ అధికారి 'ఎండలు ఎక్కువగా ఉన్నాయి కదా.. వడదెబ్బ తగిలి ఉంటుందిలే..' అంటూ.. ఫుడ్‌పాయిజన్‌ను కప్పిపుచ్చే ప్రయత్నం చేయడం విడ్డూరం. ఇంత పెద్ద ఘటన జరిగితే దానిని బయటకు రానివ్వకుండా అడ్డుకున్నారని, తమనూ తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేశారని పిల్లల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. సంబంధిత కేజీబీవీ బాధ్యులను తొలగించిన కలెక్టర్ సరైన పర్యవేక్షణ చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న జిల్లా అధికారులపై చర్య ఎందుకు తీసుకోలేదన్న ప్రశ్నలు తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాల నుంచి వస్తున్నాయి.

వైద్య శిబిరాన్ని సందర్శించిన డీఎంహెచ్‌వో

- సాక్షి కథనంతో కదిలిన యంత్రాంగం



వైద్య శిబిరాన్ని సందర్శిస్తున్న డీఎంహెచ్‌వో

లక్ష్మణచాంద: మండలంలోని చామన్‌పెల్లి గ్రామంలో వచ్చిన జ్వరాలపై 'సాక్షి'లో ఈనెల 7న 'చామన్‌పెల్లికి జ్వరమొచ్చింది' శీర్షికన కథనం ప్రచురించాం. సాక్షి కథనంతో వివిధ శాఖల అధికారులు చామన్‌పెల్లి బాటపట్టారు. ఆదివారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు డాక్టర్ ప్రత్యూష ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. సోమవారం నిర్వహించిన వైద్య శిబిరాన్ని జిల్లా వైద్యాధికారి డాక్టర్ ధనరాజ్ సందర్శించారు. గ్రామాల్లో వ్యాధులు ప్రబలకుండా నియంత్రణ, నివారణ చర్యలు చేపట్టాలని వైద్యాధికారి ప్రత్యూష, సిబ్బందిని ఆదేశించారు. ఇంటింటా జ్వర సర్వే నిర్వహించి రోగులను గుర్తించి చికిత్స అందించాలని సూచించారు. ఎండలు తీవ్రమవుతున్నందున వడదెబ్బ తగలకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని, ప్రతీ ఆశ కార్యకర్త దగ్గర, అంగన్వాడీ సెంటర్‌లో గ్రామ పంచాయతీ వద్ద ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలన్నారు. మరోవైపు గ్రామంలో పంచాయతీ సిబ్బంది పారిశుధ్య పనులు చేపట్టారు. కార్యక్రమంలో కార్యక్రమ నిర్వహణ అధికారి డాక్టర్ శ్రీనివాస్, డిప్యూటీ జిల్లా విస్తరణ, మీడియా అధికారి రవీందర్, డాక్టర్ ప్రత్యూష, హెచ్‌ఈవో శేషయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు కుభీర్‌లో కుస్తీపోటీలు

కుభీర్: మండల కేంద్రమైన కుభీర్‌లో ఉగాది పండుగ పురస్కరించుకుని మంగళవారం అంతర్రాష్ట్ర కుస్తీపోటీలు నిర్వహిస్తున్నట్లు విఠలేశ్వర ఆలయ కమిటీ చైర్మన్ బి.పెంటాజి, ఉపాధ్యక్షుడు సూది రాజన్న తెలిపారు. మొదటి బహుమతి రూ.6 వేలు, రెండో బహుమతి రూ.4 వేలు ఇవ్వడం జరుగుతుందని పేర్కొన్నారు. పోటీలు ఉదయం 11 గంటలకు ప్రారంభమవుతాయని తెలిపారు. మల్లయోధులు, కుస్తీ అభిమానులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

మమ్మల్ని మర్సిండ్రు..!

- మా ప్రాణత్యాగాలకు విలువున్నదా..?
- వెయ్యిమంది అమరుల ఆత్మఘోష
- నేడు ఉరుల మర్రిపై ఊపిరి లొదిలిన దినం..

నిర్మల్: ''ముందుగల్ల అందరికీ రాం రాం.. మేమెవరమో ఎరుకేనా..? అసలు మా గురించి ఏమన్నా యాదికున్నదా..? మీకసలు మాగురించి సోంచాయించే టైమెక్కడున్నది. మా కథేందో.. మేమే చెప్పుకుంటమిగ...

నిమ్మల గడ్డ మీద చైన్‌గేట్ అడ్డ కాడికొస్తే.. పెద్ద దిమ్మె మీద.. ఓ దిక్కు తుపాకీ పట్టుకుని మా కుమురం భీముడుంటడు. అగో.. ఇంకోపక్క బుర్రమీసాలతోని.. నెత్తికి పట్కాసుట్టి.. చేతుల విల్లంబులు పట్టుకున్న బొమ్మ ఉంటది సూడు.. అగో గాయనే మా నాయకుడు. మాకు దేవుడు లెక్క. అవ్.. ఆయననే రాంజీ.. రాంజీగోండు. మేమంతా ఆయన వెంట నడిచినోళ్లం. మీవోళ్లం.. మీకోసం 1857లనే పోరాడినోళ్లం.. మా ప్రాణాలనూ మీకోసమే అర్పించినోళ్లం. ఇదంతా.. చెబుతుంటే కొత్తగున్నదిలే. ఏంలే.. ఇయ్యల్ల ఏప్రిల్ 09గదా. గదే మీరు మర్సిపోయుంటరులే. మేము, మా త్యాగాలే యాదికి లేవు. ఇగ మా సావుదినం యాడ గుర్తుంటది. మా నాయకుడు రాంజీతో కలిపి మేం వెయ్యిమందిమి నిమ్మల ఊరవతల పెద్ద మర్రిచెట్టుకు ఉరేయబడ్డ రోజన్న మాట.

ఎందుకోసం పోరాడినమంటే..

ఊళ్లకు ఊళ్లను చెరబట్టిండ్రు తెల్లదొరలు. అడవుల మీద పడ్డరు. గప్పుడు మా నాయకుడు రాంజీకి అనిపిచ్చింది. దేశమంతా మాదేనని అచ్చినోళ్లు.. మనం ఇంకోకాడికి పోతే రాకుండా ఉంటరా..! అని. అంతే.. మా రాంజీ ఒక్కటే అన్నడు.. మనం పుట్టి పెరిగిన ఊరును.. ఆడిపాడిన అడివిని ఇడిసిపెట్టేదిలే. పాణమున్నదాకా ఈన్నే ఉండుడు అని. అంతే ఇగ.. తెల్లోళ్లను, హైదరాబాదు నవాబులను ఎదిరించాలని మేమందరం గట్టిగ అనుకున్నం. నిమ్మల కలెక్టర్ మా మీదికి సైన్యాన్ని పంపిండు. ఆ సైనికులకు అడివిల సుక్కలు సూపెట్టినం. దీంతోటి బల్లారికెళ్లి మస్తుమంది సైన్యాన్ని, తుపాకులను తెప్పిచ్చిండ్రు. అయినా మేం తగ్గలే.. అడువులు, గుట్టలు, గోదారితల్లిని ఆసరా చేసుకుని ఆళ్లమీద పోరాటం జేసినం.



వెయ్యిఉరులమర్రి ప్రాంతంలో స్మారకస్థూపం

దొంగదెబ్బ కొట్టిండ్రు..

మమ్మల్ని జంగల్‌ల సంపుడు కష్టమని దొంగదెబ్బ కొట్టిండ్రు. దొరకవట్టిండ్రు. కసిదీరా.. కాళ్లు చేతులిరగగొట్టిండ్రు. రాంజీ సహా మా అందర్ని నిమ్మలకెళ్లి ఎల్లపల్లికి వోయే దారిల ఉన్న పెద్ద మర్రిచెట్టు కాడికి ఈడుసుకపోయిండ్రు. ఆ పెద్ద చెట్టు ఊడలు, కొమ్మలకు ఒక్కపారే మా వెయ్యి మందిని ఉరేసిండ్రు. మర్రిచెట్టుకు ఉరేసేటప్పుడు బాధపడలె. మేం స చ్చినా.. మా త్యాగాలు ఎప్పటికీ ఉంటాయనుకున్నం. కానీ.. ఇప్పటోళ్లకు మేం యాదికున్నమా..? అన్న ప్రశ్ననే ఉరితాడు కంటే ఎక్కువగ గుండెలను పిండేస్తుంది. మమ్మల్ని ఉరిదీసిన మర్రిచెట్టు ఎప్పు డో పడిపోయింది. గాడ ఏదో మ్యూజియం.. అ మరధామం.. కడతమన్నరు. ఇప్పటిదాకా దిక్కు లేదు. మమ్మల్ని పట్టించుకునుడు మరిసిండ్రు. దేశం కోసం మేం చేసిన ప్రాణత్యాగాలు ముందుతరాలకు పాఠాలు కావాలనే అడుగుతున్నం. మాత్మఘోషను ఎవరూ పట్టించుకుంట లేరు. మళ్లొచ్చే ఏడాదికైనా మారుతదేమో సూస్తం''

నేడు వెయ్యిమంది వీరుల వర్ధంతి

నిర్మల్: రాంజీగోండు సహా వెయ్యిమంది అమరవీరుల చరిత్రను ప్రతీఒక్కరు తెలుసుకోవాల్సిన అవసరం ఉందని కావేరి గ్రంథాలయ వ్యవస్థాపకుడు డాక్టర్ చక్రధారి తెలిపారు. వెయ్యిమంది అమరవీరుల వర్ధంతిని పురస్కరించుకుని 'సాక్షి' మీడియా ఆధ్వర్యంలో మంగళవారం మధ్యాహ్నం స్థానిక డాక్టర్స్ లైన్‌లోని కావేరీ లైబ్రరీలో కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు.

బీజేపీతో ప్రజలకు ఒరిగిందేమీ లేదు



మాట్లాడుతున్న సీతక్క, పక్కన కాంగ్రెస్ లోక్‌సభ ఎంపీ అభ్యర్థి సుగుణ, వేదికపై ఎమ్మెల్యే బొజ్జు, డీసీసీ అధ్యక్షుడు

- జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క

నిర్మల్‌చైన్‌గేట్: బీజేపీ పదేళ్ల పాలనలో ప్రజలకు ఒరిగిందేమీ లేదని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క అన్నారు. జిల్లా కేంద్రంలోని రెడ్డి ఫంక్షన్‌హాల్‌లో ఖానాపూర్, భైంసా, నిర్మల్ నియోజకవర్గాల బూత్ లెవెల్ ఏజెంట్లతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావుతో కలిసి మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడు తూ వచ్చేనెల 13న జరగబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బూత్ లెవల్ అధికారులకు సమగ్ర శిక్షణ ఇచ్చేందుకే ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కష్టపడి పనిచేసి ఆదిలాబాద్ పార్లమెంట్ అభ్యర్థి సుగుణక్కను గెలిపించాలని కోరారు. బీజేపీ పాలనలో ఇంటింటికి అక్షింతలు మాత్రమే వచ్చాయని, సంక్షేమ ఫలాలు రాలేదన్నారు. ఆఖరకు అగరుబత్తుల మీద కూడా 5 శాతం జీఎస్టీ విధించిన ఘనత బీజేపీకే దక్కుతుందన్నారు. త్యాగాలకు కేరాఫ్ కాంగ్రెస్ పార్టీ అని అన్నారు. 34 ఏళ్లలో సోనియాగాంధీ కుటుంబంలో ఏ ఒక్కరూ అధికారాన్ని అనుభవించలేదని తెలిపారు. బీజేపీ



సమావేశంలో పాల్గొన్న కాంగ్రెస్ కార్యకర్తలు

రైల్వే, విమానయానం, బొగ్గు, సిమెంట్ ఫ్యాక్టరీలను ప్రైవేటీకరించి అంబానీ, అదానీలకు దేశ సంపదను దోచిపెడుతోందని ఆరోపించారు. దేశ రక్షణ కోసం పనిచేసే సైనికుల సేవలను అగ్ని వీర్ పేరుతో నాలుగేళ్లకే పరిమితం చేశారని తెలిపా రు.

అభివృద్ధి బాధ్యత నాది...

కష్టపడి పనిచేసి ఆదిలాబాద్ పార్లమెంట్ స్థానాన్ని గెలిచి కేంద్రంలో రాహుల్ గాంధీని ప్రధానిని చేయడమే మన లక్ష్యమన్నారు. పార్లమెంట్ అభ్యర్థిని అధిక మెజార్టీతో గెలిపిస్తే జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా జిల్లాకు నిధులు ఇచ్చే బాధ్యత తనదే అన్నారు. కష్టపడి పనిచేసిన వారికి రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో టికెట్లు ఇచ్చి గెలిపించుకుంటామన్నారు. ప్రతి ఒక్కరినీ సమన్వయం చేసి జిల్లాను అభివృద్ధి పథంలో నడిపించే బాధ్యత తనపై ఉందన్నారు.

క్లుప్తంగా

'అసత్య ప్రచారం చేస్తే ప్రజలే బుద్ధి చెబుతారు'


సన్మానిస్తున్న మెస్రం వంశీయులు

ఇంద్రవెల్లి: బీజేపీ ఎంపీ అభ్యర్థి గోడం నగేష్ తనపై చేస్తున్న అసత్య ప్రచారం మానుకోవాలని, లేకుంటే పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలే బుద్ధి చెప్పుతారని కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ అన్నారు. సోమవారం మండలంలోని కేస్లాపూర్ నాగోబా ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మెస్రం వంశీయులు ఆత్రం సుగుణకు శాలువలతో సన్మానం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ఆదిలాబాద్ పార్లమెంట్ స్థానం ఓటర్లు కాంగ్రెస్ పార్టీకే జై కొడుతున్నారని, గోడం నగేష్ దీనిని జీర్ణించుకోలేకపోతున్నారని, ఓటమి భయంతో తనను క్రిస్టియన్ మతంలో చేరినట్లు అసత్య ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో మెస్రం వంశీయులు మెస్రం ఆనంద్ రావ్, చిత్రు, శేకు, భీంరావ్ ఉన్నారు.







కోటి ఆశల ఉగాది



తెలుగు ప్రజలు నూతన సంవత్సరంగా భావించే పండగ ఉగాది. ఈ పండగ రోజున ఎద్దైనా శుభకార్యాలు ప్రారంభిస్తే ఏడాది పాటు అంతా శుభమే జరుగుతుందని ప్రజల నమ్మకం. అలాంటి పండగను ఆనందోత్సహాల నడుమ జరుపుకునేందుకు జిల్లా ప్రజలు సిద్ధమయ్యారు. శోభకృత్ సంవత్సరానికి వీడ్కోలు చెబుతూ క్రోధినామ నామ సంవత్సరానికి స్వాగతం పలికేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. పండగ రోజున సంప్రదాయబద్ధంగా ఆలయాలను సందర్శించి ప్రత్యేక పూజాధికార్యక్రమాలు నిర్వహించనున్నారు. అలాగే సాయంత్రం వేళల్లో వేద పండితులు తిథి, వారం, నక్షత్రం, యోగం, కారణం అనే ఐదు అంశాలను ప్రస్తావిస్తూ పంచాంగ శ్రవణ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఇందు కోసం జిల్లాలోని ప్రధాన ఆలయాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. – కైలాస్‌నగర్

- నేటి నుంచి క్రోధినామ సంవత్సరం ప్రారంభం
- ప్రత్యేక పంచాంగాల పఠనం
- గ్రామాల్లో వ్యవసాయ రైతుల ముహూర్తాలు



భైంసా: రైతుల వ్యవసాయ సంవత్సరం నేడు ప్రారంభం కానుంది. శోభకృత్ నామ సంవత్సర ముగింపుతో ఉగాది పర్వదినం నుంచి క్రోధి నామ సంవత్సరం మొదలుకానుంది. మంగళవారం వేకువజాము నుంచే ఉగాది పర్వదినాన్ని జరుపుకునేందుకు రైతులు ముందస్తుగానే సిద్ధమయ్యారు. ఏ గ్రామంలో చూసినా రైతులంతా ఏర్పాట్లలోనే నిమగ్నమై కనిపిస్తున్నారు. నేడు వేకువ జామున పంట పొలాల్లో పంచ పాండవులను ప్రతిష్ఠించి వ్యవసాయ పనిముట్లకు పూజలు చేస్తారు.

నేడే ఖరీఫ్ పనులకు శ్రీకారం...

ఉగాది రోజే కొత్త సంవత్సరంలో వ్యవసాయ పనులను సైతం ప్రారంభిస్తారు. ఇప్పటికే రైతులు తమ పంట పొలాల్లో పత్తిని పీకేసి భూములను చదును చేశారు. ఈ భూముల్లో క్రోధినామ సంవత్సరంలో దుక్కిదున్ని వ్యవసాయ పనులను ప్రారంభిస్తారు. ఈ మేరకు అవసరమైన పరికరాల కొనుగోలు, తయారీ చేపట్టడంలో నిమగ్నమయ్యారు.

బూరెల భోజనంతో...

ఇక పంట పొలాల్లో తమకు తెలిసిన వారిని పిలిపించి అక్కడే భోజనాలు ఏర్పాటు చేస్తారు. ఇళ్లలో నుంచి అంబళ్ల కుండలతో వంటలు చేసుకొని పంట పొలాలకు వెళ్తారు. మహిళలపై ఉన్న బంగారాన్ని ఒక ఆకులో చుట్టి నెలలో పాతి పెడతారు. దుక్కిదున్నిన తర్వాత ఆకును ఇంటి వారు తీసుకొని భూమాత తమకు కొత్త సంవత్సరంలో బంగారం లాంటి పంటలు ఇచ్చిందని సంబర పడుతారు. ఇక దుక్కిదున్నిన వారు, అంబళ్ల కుండలు నెత్తిన మోసిన వారు దినమంతా నిద్రపోకుండా గ్రామ శివార్లుదాటి వెళ్లకుండా నియమాలు పాటిస్తారు. సాయంత్రం వేళ ఇళ్లలో బూరెలు చేసి వ్యవసాయ కూలీలకు తమ వద్ద పని చేసే పాలేర్లకు భోజనాలు పెడతారు.

ఊయ్యాలలు ఊగుతూ...

ఉగాది రోజు చేతి ముహూర్తం పనులు చేసిన రైతులంతా గ్రామాల చుట్టు ఉన్న చెట్లకు తాళ్లు కట్టి ఊయ్యాలాలు ఊగుతారు. ఇక గ్రామాల్లోని ఆలయాల ముందు ఉండే బండరాళ్లను ఎత్తుకొని ఆలయం చుట్టు తిరుగుతారు. ఈ బండరాళ్ల బరువులెత్తే విషయంలో రైతులు పందేలు కాస్తారు. క్షణాల్లో అవలీలగా రైతులు తమకు తెలిసిన చిట్కాలతో పైకి ఎత్తేసి అక్కడ ఉన్న వారిని సైతం ఆశ్చర్య పరిచేలా చేస్తారు.

కులవృత్తుల వారు....

గ్రామాల్లో ఉండే వడ్రంగి, కమ్మరి, విశ్వబ్రహ్మనుల ఇళ్లలోనూ ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహిస్తారు. పనిముట్లకు ప్రత్యేక పూజలు చేస్తారు. ఉగాది పండుగరోజు మర్రి ఆకుల్లోనే మొదట పచ్చళ్లు, ఫలహారాలు చేస్తారు. వేపపువ్వుతోపాటు ఇతర వస్తువులను కలిపి పచ్చడి తయారు చేస్తారు. ఇంటికి వచ్చిన వారికి తాగించి పలహారాలు సైతం పంచిపెడతారు.

కొత్త పనుల్లో పాలేర్లు ...

కొత్త సంవత్సరంలో రైతుల వద్ద పాలేర్లుగా నియామకమైన వారంతా ఉగాదిరోజే పనుల్లో చేరుతారు. తమ కొత్త యజమాని వద్ద వచ్చే ఏడాది వరకు పని చేస్తారు. అనంతరం సాయంత్రం గ్రామాల్లో కబడ్డీ ఆటలు ఆడుతారు. ఆలయాల్లో ప్రత్యేక పంచాంగ పఠనం చేయిస్తారు.

పంటలు బాగా పండుతాయి



ఉగాది మంగళవారం రావడంతో కుజుడు రాజయ్యాడు. ఈ ఏడాదిలో కోపం, ఉద్విగ్నత, పరస్పర దూషణలు, దంపతుల కలహాలు, రాజకీయ నాయకుల మధ్య వైరం ఎక్కువగా ఉంటుంది. ఎర్రని నేలల్లో మిర్చి, వేరుశనగ, కందులు వంటి పంటలు విశేషంగా పండుతాయి. మినుములు, నల్లని నువ్వులు, ఉలువలు పండుతాయి. బంగారం, వెండి, ధరలు తగ్గి ప్రజలకు అందుబాటులోకి వస్తాయి. ఈ ఏడాది జూన్‌లో రుతు పవనాలు సకాలంలోనే వస్తాయి. మృగశిర కార్తె ఆరంభంలోనే రైతులు విత్తనాలను నాటుకోవచ్చు.

– చికిలి లక్ష్మి వెంకటేశ్వర శాస్త్రీ, సిద్ధాంతి, ప్రముఖ పంచాంగ కర్త

పాలేరన్నా.. నీకు జోహారన్నా...

భైంసారూరల్: ఉగాది పర్వదినం రోజంతా వ్యవసాయ పాలేర్లు కొత్త బట్టలు కట్టుకొని తమ యజమాని పంట పొలంలోకి వెళ్లి విధుల్లో చేరుతారు. ప్రతి రోజు ఉదయం నుంచి రాత్రి వరకూ వ్యవసాయ పనులు చేసే పాలేర్లకు అంతకుముందు వారి వారి పనితనాన్ని బట్టే వేతనాలు ఇస్తారు. ఎలాంటి డిమాండ్లు, ప్రత్యేక అలవెన్సులు అంటూ ఏమి ఉండవు.

పీఎఫ్‌లాంటివి లేక పోయినా ...

కార్పొరేట్ రంగాల్లో పని చేసే వారి జీవన శైలిని ఒక్కసారి పరిశీలిస్తే నెలసరి వేతనాలతో పాటు పీఎఫ్‌తో కూడిన ప్రత్యేక అలవెన్సులు ఇస్తారు. ఇక అనారోగ్యానికి గురైనా.. ప్రత్యేక పనులు ఉన్నా వారికంటూ వారానికో సెలవు ఇస్తారు. ప్రత్యేక సెలవులు సైతం వర్తింపజేస్తారు. కొన్ని సందర్భాల్లో ఆరోగ్యపరమైన సమస్యలు తలెత్తినా మెడికల్ అలవెన్సులు సైతం వర్తించేలా ముందస్తు ఒప్పందాలు చేస్తారు. ఎక్కువగా పని చేస్తే ఓవర్‌టైం కింద అదనంగా డబ్బులు తీసుకుంటారు.

అదే పాలేర్లయితే..

అదే పాలేర్ల పరిస్థితి వేరేలా ఉంటుంది. ఉగాదికి ముందు నలుగురు వ్యక్తుల ముందు పెద్దరైతులు వారిని కూర్చోబెట్టి పనితనాన్ని బట్టి వేతనాలు నిర్ణయిస్తారు. ఈ ఏడాది పాలేర్లకు రూ.1.30 నుంచి రూ.1.70లక్షల వరకు నిర్ణయించారు. నుదుట కుంకుమ పెట్టి బయాన పేరిట కొంత డబ్బు ఇస్తే పాలేరుగా అక్కడ నియామకం జరిగినట్టే లెక్క. ఇక ఉగాది రోజు పనుల్లో చేరిన పాలేర్లు ఏడాదంతా కష్టపడాల్సి ఉంటుంది. కాలంతో సంబంధం లేకుండా ఉదయం లేచిన నుంచి రాత్రి వరకు పనులు చేయాలి.

మండలంలో ఐటీడీఏ పీవో పర్యటన


ఖండాలలో పర్యటిస్తున్న ఐటీడీఏ పీవో

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని వాన్‌వాట్, పిప్పల్‌ధరి, ఖండాల, పోత గూడ గ్రామాల్లో ఐటీడీఏ పీవో ఖుష్బు గుప్తా సోమవారం పర్యటించారు. ఆయా గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పీవో దృష్టికి తీసుకువచ్చారు. సానుకూలంగా స్పందించిన ఆమె వాటి పరిష్కారం కోసం చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. మండలంలోని ఖండాల గ్రామ పంచాయతీ పరిధిలోని పోతగూడ శాటిలైట్ కేంద్రాన్ని సందర్శించిన అక్కడ విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బోధన డైరీ, శుభ్రత పాటించకపోవడంతో విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఎసీఈఆర్‌పీని మార్చడం జరిగిందని తెలిపారు. శాటిలైట్ కేంద్రంలో విద్యార్థులు ఎదుర్కొంటున్న తాగు నీటి సమస్యలతో పాటు ఇతర సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. ఈమె ఆయా గ్రామాల ప్రజలు ఉన్నారు.

రాష్ట్రాభివృద్ధి బీజేపీతోనే సాధ్యం

- బీజేపీ ఎంపీ అభ్యర్థి గోడం నగేశ్


ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న నగేశ్

గుడిహత్నూర్: రాష్ట్రాభివృద్ధి బీజేపీ పాలనతోనే సాధ్యమని ఆ పార్టీ ఎంపీ అభ్యర్థి గోడం నగేశ్ అన్నారు. ప్రచారంలో భాగంగా మండలంలో మల్కాపూర్, వైజాపూర్ గ్రామాల్లో పర్యటించారు. ఆయన మాట్లాడుతూ ప్రజల బాగుకోసం బీజేపీ కట్టుబడి పని చేస్తోందన్నారు. మల్కాపూర్ వద్ద ఉపాధి కూలీలతో మాట్లాడి బీజేపీకి ఓటు వేయాలని అభ్యర్థించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు బ్రహ్మనంద్, తాంసి జెడ్పీటీసీ రాజు, నాయకులు జాడి సుభాష్, భరత్, వామన్ గిత్తే, సుధాకర్ రెడ్డి, కేశవ్ గిత్తే, సుభాష్ రెడ్డి, సుకుదేవ్ ఉన్నారు.

ప్రతి కార్యకర్త సైనికుడిలా పని చేయాలి

ఇంద్రవెల్లి: ముచ్చటగా మూడో సారి నరేంద్ర మోదీని ప్రధాన మంత్రి చేయడానికి బీజేపీ కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని బీజేపీ ఎంపీ అభ్యర్థి నగేష్ అన్నారు. మండల కేంద్రంలోని కాగ్నే ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్‌తో కలిసి హాజరయ్యారు. జిల్లా ఉపాధ్యక్షుడు భీంరావ్, జెడ్పీటీసీ పుష్పలత ఉన్నారు.

స్వర్ణ నదిలో పడి రైతు మృతి

సారంగపూర్: మండలంలోని స్వర్ణ గ్రామానికి చెందిన అచ్చ చిన్న ఆశన్న(56) రైతు మృతదేహం సోమవారం స్వర్ణ నదిలో లభ్యమైనట్లు ఎస్సై చంద్రమోహన్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. రైతు అచ్చ చిన్న ఆశన్న సైకిల్‌మోటారుపై ఆదివారం మధ్యాహ్నం గ్రామ సమీపంలోని తన పంట పొలానికి వెళ్లాడు. ఎంతకూ తిరిగి ఇంటికి చేరకపోవడంతో ఆయన కుటుంబీకులు వెతికినా ఆచూకీ లభించలేదు. తమ బంధువుల ఇళ్లకు ఫోన్ చేసినా రాలేదని సమాధానం రావడంతో భయంతో రాత్రంతా గాలించారు. అయితే అటుగా వెళ్లిన గ్రామస్తులు ఆశన్న సైకిల్‌మోటారును గమనించి ఆయన కుటుంబీకులకు, పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని, సైకిల్ మోటారును బయటకు తీయించారు. ఈమేరకు కేసు విచారణ చేపట్టి పూర్తి వివరాలను వెల్లడిస్తామని ప్రాథమిక విచారణలో ప్రమాదవశాత్తు పడిపోయి ఉండవచ్చని బావిస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

ఉరేసుకుని ఒకరి ఆత్మహత్య

ఆదిలాబాద్‌రూరల్: ఉరేసుకుని ఒకరు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలో సోమవారం చోటుచేసుకుంది. హెడ్‌కానిస్టేబుల్ ఫతేసింగ్ వివరాల ప్రకారం... ఆదిలాబాద్ రూరల్ మండలంలోని యాపల్‌గూడ గ్రామానికి చెందిన పందిరి మహేందర్ (34)కు 14ఏళ్ల కిందట మహారాష్ట్రకు చెందిన యువతితో వివాహమైంది. వీరికి ఇద్దరు పిల్లలున్నారు. గత నెల క్రితం భార్యాభర్తల గొడవతో భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో మహేందర్ మద్యానికి బానిసయ్యాడు. మనస్తాపంతో ఆదివారం రాత్రి ఇంట్లో ఉరేసుకున్నాడు. సోమవారం ఉదయం స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతుడి తండ్రి సత్యనారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఇదిలా ఉండగా మృత్యుని వద్ద సూసైడ్ నోట్ లభించిందని, ఆ సూసైడ్ నోట్ వాట్సప్‌లలో వైరల్ అవుతున్న విషయంపై ఎస్సై ముజాహిద్‌ను «సాక్షి» ఫోన్‌లో సంప్రదించగా ఆ విషయం తమ దృష్టికి వచ్చిందని దానిపై విచారణ చేపడుతున్నట్లు ఆయన తెలిపారు.

బావిలోపడి మహిళా రైతు మృతి


హాపవత్ నీలా(ఫైల్)

కడెం: వ్యవసాయ బావిలో పడి మహిళా రైతు మృతి చెందిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. పెద్దూర్‌తండాకు చెందిన హపవత్‌నీలా(30)సోమవారం మధ్యాహ్నం వరిపొలానికి నీరు పెట్టేందుకు వెళ్లింది. మోటార్ ఆన్ చేసే క్రమంలో ప్రమాదవశాత్తు బావిలో పడింది. కుటుంబ సభ్యులు వెళ్లేసరికి బావిలో కనిపించింది. మృతురాలు నీలాకు ఇద్దరు కూతుళ్లు. ప్రస్తుతం కడెం పీఎసీఎస్ వైస్ చైర్మన్ కాగా భర్త దేవేందర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కృష్ణసాగర్‌రెడ్డి పేర్కొన్నారు.

గల్ఫ్‌లో ఖానాపూర్ వాసి..


నవీన్ (ఫైల్)

ఖానాపూర్: ఉపాధి నిమిత్తం గల్ఫ్ దేశం బేరాన్ వెళ్లిన యువకుడు అక్కడ రోడ్డు ప్రమాదానికి గురై మృతి చెందిన సంఘటన సోమవారం తెలిసింది. కుటుంబీకుల వివరాల ప్రకారం.. పట్టణంలోని సుభాశ్‌నగర్ కాలనీకి చెందిన ఉప్పు నవీన్(29) ఏడాది క్రితం బేరాన్ దేశానికి వెళ్లి అక్కడ కూలీ పనిచేస్తున్నాడు. సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నవీన్ మృతి చెందినట్లు అక్కడే ఉండే బంధువు రమేశ్ నవీన్ కుటుంబీకులకు ఫోన్‌లో తెలిపాడు. కనీసం ఉండడానికి ఇల్లు కూడా లేదని, అప్పులు చేసి విదేశాలకు వెళ్లాడని, ప్రభుత్వాలు తమను ఆదుకోవాలని నవీన్ బంధువులు వేడుకుంటున్నారు. మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకురాలని వేడుకుంటున్నారు. నవీన్‌కు భార్య లావణ్య, ఐదేళ్ల కుమారుడు ఉన్నారు. నవీన్ మృతి విషయం తెలియడంతో కుటుంబం శోకసంద్రంలో మునిగిపోయింది.

శివాజీ చౌక్‌లో నీడ



నిర్మల్ పట్టణంలో బస్టాపుల్లో నీడ లేని తీరపై 'ఎండలో ప్రయాణికుల ఎదురుచూపు' శీర్షిక ఈనెల 1వ సాక్షిలో ప్రచురితమైన ఫొటో కథనానికి ఆర్టీసీ అధికారులు స్పందించారు. మంచిర్యాల, భైంసా ఖానాపూర్‌వెళ్లే, శివాజీచౌక్‌లో ప్రయాణికుల కోసం తడకలతో తాత్కాలిక షెడ్డు ఏర్పాటు చేశారు. - సాక్షి ఫొటోగ్రాఫర్ నిర్మల్



ట్రాక్టర్‌ను చోరీ చేసిన నిందితుడి రిమాండ్

ఖానాపూర్: పట్టణంలోని గాంధీనగర్ కాలనీకి చెందిన డ్రైవర్ మహేందర్ ట్రాలీ ట్రాక్టర్‌తో రోజంతా పనిచేసి ఈ నెల 6వ తేదీన రాత్రి ఇంటి వెనకాల ఉంచాడు. ఈ క్రమంలో అర్ధరాత్రి ఇంటి నుంచి ట్రాక్టర్‌ను మాయం కావడంతో ఆదివారం బాధితుడు ఫిర్యాదు చేయగా 24 గంటల్లోనే నిందితుడిని అరెస్టు చేసి ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్నామని ఎస్సై లింబాద్రి తెలిపారు. జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలం సంగెం శ్రీరాంపూర్‌కు చెందిన ఆరేటి రవి ట్రాక్టర్‌ను కడెం మండలంలోని మద్దిపడగ గ్రామంలో దాచి ఉంచినట్లు తెలిపారు. ట్రాక్టర్‌ను రికవరీ చేయడంతో పాటు నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు. సకాలంలో నిందితుడిని పట్టుకున్న ఎస్సైతో పాటు పోలీస్ సిబ్బంది మహేష్, భీమేష్‌లను సీఐ సైదారావు అభినందించారు.

యువకుడు అదృశ్యం

కడెం: మండలంలోని లింగాపూర్ గ్రామానికి చెందిన కైరం లింబాద్రి అనే యువకుడు అదృశ్యమయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 3న ఇంట్లో నుంచి వెళ్లిన లింబాద్రి తిరిగి ఇంటికి రాలేదు. కుటుంబ సభ్యులు ఆచూకీ కోసం గాలించినా దొరకలేదు. సోమవారం యువకుడి తండ్రి నర్సయ్య ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కృష్ణ సాగర్‌రెడ్డి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

సోన్: మండలంలోని కడ్తాల్ గ్రామ శివారులోని 44వ జాతీయ రహదారిపై రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్న సంఘటనలో యువకుడికి తీవ్ర గాయాలైనట్లు ఎస్సై సంతోషం రవీందర్ సోమవారం తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. సోన్ గ్రామానికి చెందిన తోపారం సాయి ప్రసన్న ఆదివారం సాయంత్రం నిర్మల్ వైపు నుంచి సోన్‌కు వెళ్తున్నాడు. అదే సమయంలో అడ్డదారిలో వచ్చిన మరో ద్విచక్ర వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో సాయిప్రసన్న తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుండి మెరుగైన వైద్యం కోసం సోమవారం హైదరాబాద్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మొక్కజొన్న పంట దగ్ధం

లోకేశ్వరం: మండలంలోని పుస్పూర్ గ్రామానికి చెందిన గన్ను శ్రీనివాస్‌రెడ్డి, గన్ను అనురాధ రైతులకు మొక్కజొన్న పంట సోమవారం కరెంటు షాక్‌తో పూర్తిగా దగ్ధమైంది. బాధితుల వివరాల ప్రకారం.. పుస్పూర్‌కు చెందిన గన్ను శ్రీనివాస్‌రెడ్డి, గన్ను అనురాధ గ్రామ శివారులోని రెండు ఎకరాల్లో మొక్కజొన్న పంటను సాగు చేశారు. పంటను కోసి చేనులో ఆరబెట్టారు. సోమవారం కరెంటు షాట్ సర్క్యూట్‌తో కాలిబూడిదైంది. అగ్నిమాపక కేంద్రం సిబ్బంది చేరుకుని మంటలు ఆర్పివేశారు. రూ.2లక్షల నష్టం వాటిల్లినట్లు వారు వాపోతున్నారు.

